క్లుప్తంగా

నేడు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

వాల్మీకిపురం: స్థానిక శ్రీ షిరిడి సాయి బాబా చాధారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో తిరుపతి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఆసుపత్రి సహకారంతో కేన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే 40 సంవత్సరాలు పైబడిన మహిళల్లో సంక్రమించే గర్భకోశ వ్యాధులకు సంబంధించిన ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్న ట్రస్టు చైర్మెన్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింక్ బస్ ద్వారా మహిళా వైద్యుల పర్యవేక్షణలో సుమారు రూ.7వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చు అయ్యే వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

వాహనాల వేలంలో రూ.6 లక్షల ఆదాయం

మదనపల్లె : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు తాలూకా పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో ప్రభుత్వానికి రూ.6లక్షల ఆదాయం వచ్చినట్లు టూ టౌన్ సీఐ మురళీకృష్ణ తెలిపారు. మొత్తం ఎనిమిది వాహనాలను వేలం వేయగా, పాటదారులు ఏడు ద్విచక్రవాహనాలను జీఎస్టీతో కలిపి రూ.6,00,620లకు కొనుగోలు చేశారన్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు వేలంలో వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమచేసినట్లు సీఐ తెలిపారు. తాలూకా ఎస్‌ఐలు చంద్రశేఖర్, సుధాకర్, ఏఎస్‌ఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

మదనపల్లె : ఇంటివద్ద నిలిపిఉంచిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారని బాధితుడు భానుమూర్తి బుధవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. వలసపల్లె పంచాయతీ నవోదయకాలనీకి చెందిన భానుమూర్తి పీటీఎం మండలం పట్టెంవాండ్లపల్లె పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఈయన ద్విచక్రవాహనాన్ని ఇటీవల పట్టణంలోని అమ్మినేని వీధికి చెందిన స్నేహితుడు వెంకటరమణ తీసుకువచ్చాడు. ఇంటి వద్ద వాహనాన్ని నిలిపిఉండగా ఆదివారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీచేశారు. పలుచోట్ల గాలించినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

రైతులకు రాయితీ ప్రయోజనాలు

కలకడ : రైతులకు రాయితీ ప్రయోజనాలు అందించే బాధ్యత ఆర్‌బీకే సిబ్బందిపై ఉందని మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు హరినాథరెడ్డి, కోన సర్పంచ్ జల్లా రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కోన పంచాయతీ గంగిరెడ్డిగారిపల్లె, తిప్పిగారిపల్లె, హరిజనవాడ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట నమోదు వివరాలు, బయోమెట్రిక్ తీసుకుంటున్న ఆర్‌బీకే ఏఈఓ అక్రంబాషాను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పంచాయతీలోని ప్రతి సాగుచేసిన పంట వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. వంద శాతం ఈక్రాప్ నమోదు పూర్తి చేసి రైతులు సాగు చేసే పంటలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయలన్నారు.

ఆదర్శ పాఠశాల తనిఖీ



ఆదర్శ పాఠశాలలో తనిఖీ చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ సతీష్‌కుమార్

నిమ్మనపల్లె : మండలపరిధిలోని రెడ్డివారిపల్లె ఆదర్శ పాఠశాలను స్పెషల్ ఆఫీసర్ సతీష్‌కుమార్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాప్రమాణాల స్థాయిని, ఆహార నాణ్యతను పరిశీలించారు. బోధనా సిబ్బంది రోజువారీ విధుల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్.కే.ఎస్.ఎన్.మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

కలకడ : పదో తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కెఎస్ మస్తాన్ కోరారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. మండలంలో ఆదర్శ పాఠశాల పది ఫలితాల్లో ఆదర్శంగా నిలవాలన్నారు. పాఠశాలలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని కార్మికురాలికి తీవ్రగాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం పట్టణంలో జరిగింది. చలపతిరావుకాలనీకి చెందిన లక్ష్మీదేవి (32) ఉదయం విధులకు వెళుతుండగా టౌన్‌బ్యాంక్ సర్కిల్ వద్ద ద్విచక్రవాహనం వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడింది. స్థానికులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యోగ, భోగాలందించే యోగభోగేశ్వరుడు

- నాడు మడికయ్యల శివాలయమే నేడు యోగభోగేశ్వరాలయం
- నిత్యం పూజలు, భక్తుతో సందడి



యోగభోగేశ్వరస్వామి ఆలయం



యోగభోగేశ్వరుడు

మదనపల్లె సిటీ: భక్తులకు యోగ,భోగాలు అందించే యోగభోగేశ్వరుడిగా పేరు ప్రఖ్యాతులు పొందారు. దాదాపు 1500 సంవత్సరాల క్రితం అతిపురాతన ఆలయంగా శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయం వెలిసింది. మదనపల్లె పట్టణ పొలిమేర్లలోని చిప్పిలి గ్రామంలో మడికయ్యల్లో వెలసిన స్వామి నిత్యం పూజలు, భక్తులతో అలరారుతోంది. జిల్లాలోని శైవక్షేత్రాల్లో శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయం ఒకటి. మదనపల్లె పట్టణంను పూర్వం మర్యాద రామన్న పట్టణమని పిలుస్తుండేవారు. పాలేగాళ్లు ఈ ప్రాంతం పరిపాలించినప్పుడు వ్యవసాయ భూముల్లో రైతులు పొలం దున్నుతుంటే ఒక శివలింగం ఉద్భవించింది. ఆ ఉద్భవించిన లింగమే ప్రస్తుతం ఉన్న శివలింగం. భక్తులు అక్కడే దేవాలయంను నిర్మించారు. తమిళనాడుకు చెందిన ఓ పూజారి మదనపల్లెకు చేరుకుని ఆలయం వద్దను వెళుతుండగా ఓ నాగుపాము కన్పించి ఆలయంకు దారి చూపిందని పురాణాలు చెబుతున్నాయి. అప్పటి నుంచి ఆలయంలో పూజారి నిత్యం పూజలు చేశారు. సప్తరుషులు అహోబిలం మఠం నుంచి తిరుమల కొండకు పోవు సమయంలో మార్గమధ్యంలో మడికయ్యల శివాలయంలో విడిది చేసి బాహుదా నదిలో స్నానమాచరించి శివర్చాన చేసుకుని తిరుమలకు వెళ్లేవారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. అప్పట్లో మడికయ్యల్లో శివాలయం నిర్మించడంతో అప్పటి నుంచి మడికయ్యల శివాలయంలో పేరుపొందింది. ఆలయంలో రాహు, కేతు ప్రతిబింబాలు, బల్లుల బింబాలు ఇప్పటికి ఉన్నాయి. తరిగొండ వెంగమాంబ ఆలయంను సందర్శించి ఉపదేశం ఇచ్చినట్లు పురణాలు చెబుతున్నారు. ఆలయంలో సంకష్ట గణపతి, శ్రీ వల్లిదేవసేన సమేత సుబ్రమణ్యస్వామి, దక్షిణామూర్తి, రాహు కేతుల విగ్రహాలు ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఇటీవల నందిమండపం, నూతన ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు.

శివరాతికి ఏర్పాట్లు

మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో భాగంగా శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో 17న ఉదయం మహాగణపతి పూజ, స్వస్తివాచకం, ధ్వజారోహణంతో ప్రారంభవుతుందని ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ తెలిపారు. 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని మహాన్యాసకపూర్వక రుద్రాభిషేకం జరుగుతుందన్నారు. ఉదయం నుంచి సర్వదర్శనం కల్పిస్తామన్నారు. సాయంత్రం శివపార్వతులకు కళ్యాణం, పుష్పపల్లకి సేవలు కన్నుల పండువగా జరుగుతాయన్నారు. 19న ధ్వజావారోహణం, పవళింపు సేవలతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

పంచాయతీల అభివృద్ధి పై దృష్టి సారించాలి

–డీపీవో ధనలక్ష్మీ



వర్మికంపోస్టు ఎరువుల తయారీని పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మీ

గుర్రంకొండ: పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందుంచుకొని తద్వారా అభివృద్ధి సాధించాలని జిల్లా డీపీవో ధనలక్ష్మీ అన్నారు. బుధవారం మండలంలోని గుర్రంకొండలో మూడు సచివాలయాలను తనిఖీ చేశారు. నడిమికండ్రిగలొని అంగన్‌వాడీ కేంద్రాన్ని, డంపింగ్ యార్డుల పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కల్పిస్తున్న వసతులపై ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి అందుతున్న అన్ని సరుకులు పిల్లలకు చేరుతున్నాయో లేదో అడిగి తెలుసుకొన్నారు. డంపింగ్ యార్డు వద్దచేరుకొని తనిఖీలు చేపట్టారు. అక్కడ చేపట్టి వర్మికంపోస్టు ఎరువుల తయారీని పరిశీలించారు. అనంతరం మండలంలోని అన్ని సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీల్లో ఆదాయవనరుల సృష్టి, పెంపుదలపై కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. అన్ని పంచాయతీల్లో ఇంటిపన్నులు సకాలంలో వసూలు చేయాలన్నారు.

గుర్రంకొండ సమస్యలను పరిష్కరించండి: పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మేజర్ పంచాయతీ సర్పంచ్ మెహర్‌తాజ్, ఉపసర్పంచ్ కొండేటి సుమలతలు జిల్లా డీపీవో ధనలక్ష్మీని కోరారు. సచివాలయానికి విచ్చేసిన ఆమెతో వారు సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని బస్టాండుతో పాటు గ్రామమంతా ఎన్‌హెచ్ 340 రోడ్డు నిర్మాణపనులు పెండింగ్‌లో ఉంచడం వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల సాక్షిలో ప్రచురితమైన నత్తనడకన ఎన్‌హెచ్ 340 నిర్మాణపనులు అన్న వార్త క్లిపింగ్‌ను డీపీవో సమర్పించారు. ఎన్‌హెచ్ 340 రోడ్డు పెండింగ్ పనుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని డీపీఓ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నారాయణ, మాజీ ఎంపీపీ జమీర్‌అలీఖాన్, సర్పంచ్ మెహర్‌తాజ్, ఉపసర్పంచ్ కొండేటి సుమలత, ఏఓ నాగశివారెడ్డి, ఈఓ బ్రహ్మానందరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కేవీపల్లె : మండలంలోని గ్యారంపల్లె పంచాయతీ కరుణానగర్‌లో మిరియాల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. బుధవారం ఉదయం నుంచి డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ భాస్కర్‌రెడ్డి సుమారు వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఏనుగు మల్లమ్మ వార్షిక పూజ



ములకలచెరువు: మండలంలోని బురకాయలకోటలో వెలసిన శ్రీఏనుగు మల్లమ్మ వార్షిక పూజను స్థానికులు, నిర్వాహకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహాన్ని పూలతో ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే అన్నదానం అన్నదానం చేశారు.

భవిష్యత్తుకు భరోసా వ్యాధి నిరోధక టీకాలు

పీలేరు : వ్యాధి నిరోధక టీకాలు పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్గిస్తాయని వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. బుధవారం తలపుల పీహెచ్‌సీలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు తీవ్ర హాని, అంగవైకల్యం, మరణాన్ని కల్గించే వ్యాధుల నుంచి టీకాలు విముక్తి కల్గిస్తాయని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళి

మదనపల్లె : వచ్చే నెలలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేపట్టాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం, జెడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలు ఏర్పాట్లు, స్ట్రాంగ్‌రూమ్‌లు, ఎన్నికల సామగ్రి పంపిణీ కౌంటర్లు తదితర అంశాలపై తహసీల్దార్ సీకే శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లా ఆధారంగా పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె మూడు నియోజకవర్గాలకు పట్టణంలోని జెడ్పీహైస్కూల్‌ను ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మార్చి 12న ఎన్నికల సామగ్రి పంపిణీ, 13న ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి పొరపాటుకు తావివ్వకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉంచుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

పెద్దమండ్యం: తూర్పు రాయలసీమ (ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు) పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డినికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. మండలంలోని శిద్దవరం, బండమీదపల్లె, కలిచెర్ల, కోటకాడపల్లె, పాపేపల్లె, ముసలికుంట, బండ్రేవు గ్రామ సచివాలయాలలో బుధవారం ఈ సందర్భంగా పట్టభద్రులను కలిశారు. కార్యక్రమంలో మండల సచివాలయాల కన్వీనర్ కన్నపు రెడ్డెప్పరెడ్డి, సర్పంచ్‌లు బయ్యారెడ్డి, విశ్వనాథ, పద్మావతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవ, నరేష్‌రెడ్డి, శ్రీకాంత్, రామిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కిషోర్, వంశీ లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎంపీ మిథున్‌రెడ్డి రూ. లక్ష విరాళం



ఎంపీ మిథున్‌రెడ్డి పంపించిన రూ.లక్ష నగదును నిర్వాహకులకు అందజేస్తున్న నాయకులు

గుర్రంకొండ: పట్టణంలోని దళితవాడలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పోలేరమ్మతల్లి ఆలయానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి రూ. లక్ష విరాళం అందజేశారు. దళితవాడలో ఎస్‌ఎస్‌ఎఫ్ వారి సహకారంతో టీటీడీ వారు నూతంగా పోలేరమ్మతల్లి ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఆలయ నిర్మాణానికి సహకరించాల్సిందిగా గ్రామస్తులు ఎంపీని కోరారు. దీంతో ఎంపీ రూ. లక్షను విరాళంగా పంపించారు. బుధవారం ఆలయం నిర్మాణం వద్ద ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమీర్‌అలీఖాన్ చేతుల మీదుగా నిర్వాహకులకు ఎంపీ పంపించిన రూ.లక్షను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఖదీర్, మార్కెట్‌కమిటి డైరెక్టర్ జయేంద్ర, ఆర్‌ఎస్‌ఎస్ కిషోర్, నాయకులు నాయిని శివశంకర్, నూర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

పెద్దతిప్పసముద్రం: అన్నమయ్య జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు బుధవారం స్థానిక మోడల్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి, వంట గదులు, మరుగు దొడ్లతో పాటు పాఠశాల రికార్డులను పరిశీలించారు. బాలికల హాస్టల్ వార్డన్‌తో సమీక్షించారు.

పరీక్షల పట్ల భయం విడనాడాలి

పీలేరు రూరల్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు భయాన్ని విడనాడాలని కార్వేటినగర్ డైట్ అధ్యాపకులు డాక్టర్ వై. శ్రీనివాసులురెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కోటపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, ఎనుములవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. టీవీలకు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై మాత్రమే దృష్టి సారించాలని సూచించారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించి వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ లక్ష్యాలను సాధిస్తే మంచి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వేణుగోపాల్ రెడ్డి, శివశంకరయ్య, ఉపాధ్యాయులు సూర్య ప్రకాష్, రెడ్డెప్పరెడ్డి, మస్తాన్‌సాహెబ్, శేషాద్రిరెడ్డి, చంద్రరెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండి అన్నస్వామి ఆలయంలో శివరాత్రికి ఏర్పాట్లు



పగడాల లక్ష్మీపతి స్వామి

మదనపల్లె: బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామంలో గుగూట కోన శ్రీ బండి అన్న స్వామి ఆలయంలో మహా శివరాత్రికి ఆలయ పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం శివ కోటి అర్చన, శనివారం మహాశివరాత్రి సందర్భంగా భక్తుల కోసం సానవల చిన్నమ్మ కథను చెప్పనున్నారు. బండన్న స్వామి ఆశ్రమంలో 131 విగ్రహాలను భక్తులు దర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. శివరాత్రి రోజున శివపార్వతుల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు పగడాల లక్ష్మీపతి స్వామి తెలిపారు. ఇప్పటికే ఉత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలపై సమీక్ష

కలికిరి: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 18, 19 తేదీలలో మండల పరిధిలోని మేడికుర్తిలో వెలసిన శ్రీఅగస్తీశ్వరస్వామి, గుట్టపాళెం గ్రామం పూలకొండ వెలసిన మల్లికార్జున స్వామి ఆలయాల్లో ఏర్పాట్లపై బుధవారం అధికారులు సమీక్షించారు. మేడికుర్తి బాహుదానదిలో ఝరి, స్వామి వారి గ్రామోత్సవం, పూలకొండలో శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నారు. తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, ఎస్‌ఐ లోకేష్ రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ ముజీబుర్‌రెహమాన్, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించండి



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

మదనపల్లె : ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులను చేర్పించి బంగరు భవిష్యత్తుకు బాటలు వేయాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలిపారు. సమాజంలోని వివిధ వర్గాల వారికి ప్రభుత్వ కళాశాలల విద్య నాణ్యతపై అవగాహన కల్పించి నమోదును పెంచడమే ధ్యేయంగా బుధవారం డిగ్రీ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ.. ఉన్నత విద్య కమిషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి, విద్యార్థుల నమోదు పెంచేందుకు ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఈనెల 17న కళాశాలలో ఓపెన్‌డే నిర్వహించి పట్టణంలోని వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థులను ఆహ్వానించి కళాశాలలోని మౌలికవసతులు, అవకాశాలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు భవానీ, విష్ణుప్రియ, మోహన్‌బాబు, ఖాజావలీ, శ్రీనివాసులు, మోహనవల్లి, జ్యోతి, హజీరాఖానం తదితరులు పాల్గొన్నారు.

నేలమల్లేశ్వరస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లు

– ఈఓ మంజుల



మాట్లాడుతున్న ఆలయ ఈఓ మంజుల

నిమ్మనపల్లె : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని తవళం గ్రామంలో వెలసిన శ్రీయోగనేలమల్లేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే ఉత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ మంజుల, ఉత్సవ పర్యవేక్షణాధికారి రవికుమార్ తెలిపారు. బుధవారం ఆలయం వద్ద తహసీల్దార్ సీ.ఆర్.మంజుల, ఎంపీడీఓ లీలా మాధవి, సింగిల్‌విండో రెడ్డిశేఖర్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ రమణారెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులతో ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 18, 19 తేదీల్లో వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. 18 రాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా జరుగుతుందన్నారు. అనంతరం నాట్యప్రదర్శన, భక్తుల రాత్రి జాగరణకు అవసరమైన ఏర్పాట్లను సిద్ధం చేశామన్నారు. ఉత్సవాలకు మదనపల్లె ఆర్టీసీ రెండో డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు భక్తులకు ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డెప్ప, ఆలయ తాత్కాలిక కమిటీసభ్యులు గోపాలకృష్ణ, నారాయణ, గంగాధర, శంకర, రవి, రవీంద్ర పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

కురబలకోట: శివరాత్రి ఉత్సవాలకు మండలంలోని అంగళ్లు మల్లయ్యకొండ, కంటేవారిపల్లె కాశిగుట్టపై పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఎంపీపీ బి.దస్తగిరి, తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

మల్లయ్యకొండకు 20 ఆర్టీసీ బస్సులు

తంబళ్లపల్లె: మహాశివరాత్రి పర్వదినాన ప్రముఖ పుణ్యక్షేత్రం మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యం కోసం 20 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణాశాఖ(డీపీటీవో) అధికారి జగదీష్ తెలిపారు. బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ కెఆర్ మల్లిరెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి, మదనపల్లె వన్‌డిపో డీఎం వెంకటరమణారెడ్డి, సీఐ రేవతి, స్థానిక ఎస్‌ఐ రామక్రిష్టారెడ్డిలు ఆర్టీసీ బస్సు ట్రైల్ రన్ నిర్వహించారు. బస్సుల రాకపోకలు, బస్సులు నిలిపే స్థలాలు పరిశీలించారు. కొండపై పూజారి ఈశ్వరప్ప బస్సులకు ప్రత్యేక పూజలు చేశారు. శివరాత్రిరోజు కొండకింద నుంచి కొండపైకి 20 బస్సులు, మదనపల్లె నుంచి మల్లయ్యకొండ కింద వరకు 15 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొండ కింద నుంచి కొండపైకి రూ.40లు భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్టీసీ అభివృద్ధికి సహకరించాలన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో లాభాలు

– జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



పొలంబడి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

పీలేరు : రైతులు పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా అధిక లాభాలు ఆర్జించవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. మండలంలోని బోడుమల్లువారిపల్లె పంచాయితీ మొరవవడ్డిపల్లె వద్ద పొలంబడి కార్యక్రమంలో చేపట్టిన పంటల సాగును ఆమె పరిశీలించారు. ఆర్‌బీకే సిబ్బంది పొలంలో చేపట్టిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక ప్రయోగాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయాధికారులు, సిబ్బంది ఇచ్చే సూచనలను రైతులు పాటిస్తూ పంటలు సాగు చేయడం వల్ల పలు ప్రయోజనాలు ఉంటాయన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి సాగు చేయడం వల్ల తక్కువ ఖర్చుతో పంట ఆరోగ్య కరంగా అధిక దిగుబడులు వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు టి. సావిత్రి, వై.వి. రమణరావు, ఏవోలు షణ్ముగం, రమాదేవి, ఏఈవోలు నజీర్‌అహ్మద్, ఇంద్రసేనారెడ్డి, అల్తాఫ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో అధిక ఆదాయం

మదనపల్లె : చిరుధాన్యాల సాగును చేపట్టడం ద్వారా రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని ఏఓ నాగప్రసాద్ అన్నారు. మండలంలోని కోటవారిపల్లె గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ నాగప్రసాద్ మాట్లాడుతూ.. ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. చిరుధాన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులు వాటిని పండించి అధిక ఆదాయాన్ని పొందాలన్నారు. రైతులు సాగుచేస్తున్న పంటల్లో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యవంతమైన పంటలను పండించవచ్చన్నారు. పొలంబడి క్షేత్రంలో ఎకలాజికల్ ఇంజినీరింగ్‌లో భాగంగా రాగులను విత్తించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు నవ్యజ్యోత్స్న, ఆర్‌బీకే, జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలే లక్ష్యం

–జిల్లా ప్రజారవాణా అధికారి జగదీష్



క్యాష్ అవార్డు అందజేస్తున్న డీపీటీఓ జగదీష్

మదనపల్లె సిటీ: మదనపల్లె ఆర్టీసీ బస్టాండు ఆధునికీకరించి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతోనే పీపీపీ (ప్రైవేటు పబ్లిక్ పార్టిసిపేషన్) కింద స్థలాలు లీజుకు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా ప్రజారవాణా అధికారి జగదీష్ అన్నారు. బుధవారం వన్,టు డిపోలను తనిఖీ చేశారు. టు డిపో కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. మదనపల్లె బస్‌స్టేషన్ 1975లో నిర్మించారని, 19 ప్లాట్ ఫారమ్‌లు ఉన్నాయన్నారు. సుమారు 4.50 ఎకరాల విస్తీర్ణం ఉందన్నారు. ప్రయాణికులకు అనుగుణంగా మరిన్ని సేవలు అందించాల్సి ఉందన్నారు. దీని కోసం పీపీపీ కింద 33 సంవత్సరాలకు స్థలాలను లీజుకు ఇస్తామన్నారు. రవాణారంగంలో అనుభవం కలిగినవారు, వ్యాపారులు తమకు సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. కొందరు ఆర్టీసీ బస్టాండును ప్రైవేటు వ్యక్తులకు అమ్మకాలు చేస్తున్నారనే ఆరోపణలు అవాస్తమన్నారు.

శివరాత్రికి 519 బస్సు సర్వీసులు

శివరాత్రి పండుగను పురస్కరించుకుని జిల్లాలోని అన్ని డిపోలు 519 బస్సు సర్వీసులు శైవక్షేత్రాలను నడపనున్నట్లు డీపీటీఓ జగదీష్ అన్నారు. సాధారణ చార్జీలతో బస్సులు నడపనున్నట్లు తెలిపారు. డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సభలో పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు ఆర్‌ఎల్ రెడ్డి, శ్రీరాములు, టార్గెట్‌లు అధికంగా సాధించిన చంద్రకళ, రాణి, రాజ, ఈపీకె అధికంగా సాధించిన బి.వి.రావు, కండక్టర్లు కుమార్, ముస్తాఫాలను క్యాష్ అవార్డులు అందజేశారు.

క్షయరోగులకు పౌష్టికాహారం అందజేత

మదనపల్లె : దాతల సహాయంతో క్షయరోగులకు పౌష్టికాహారాన్ని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి బుధవారం పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. క్షయరోగులు మందులతో పాటు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వ్యాధి నుంచి త్వరగా కోలుకునేందుకు పౌష్టికాహారం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. ఆరునెలలపాటు క్రమంతప్పకుండా మందులు వాడాలన్నారు. పేదరోగులు ఆర్థిక సమస్యల కారణంగా పౌష్టికాహారలోపంతో వ్యాధి నుంచి కోలుకోలేకపోతున్నారన్నారు. అలాంటి వారిని ఆదుకునేందుకు దాతలు ముందుకురావాలన్నారు. ఆర్‌ఎంఓ దివాకర్, క్షయవ్యాధి నివారణ విభాగం సిబ్బంది ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.